బీఆర్ఎస్ నేతల అరెస్టుతో రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్ స్టేషన్‌లో ఆందోళన చేస్తున్న కార్యకర్తలు, ప్రజలు

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో భగ్గుమన్న నిరసనలు

మర్లవడ్డ తెలంగాణ.. సర్కారు హైరానా

బేషరతుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విడుదల

కేశంపేటలో అర్ధరాత్రిదాకా ఆందోళనలు.. డీజీపీ హామీ మేరకు సహకరిస్తున్నాం

దాడిచేసినవారిపై హత్యాయత్నం.. కేసు నమోదు చేస్తామన్నారు

కార్యకర్తలను ఇబ్బందిపెడితే మా ప్రాణాలను అడ్డుపెడతాం:హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ప్రజాందోళనలకు కాంగ్రెస్ ప్రభుత్వం తలొగ్గింది. కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలను గురువారం రాత్రి బేషరతుగా విడుదల చేసింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11:30 గంటలకు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు చేసిన ఉద్యమానికి, ముఖ్యంగా కేశంపేట పోలీస్‌స్టేషన్ వద్దకు తరలివచ్చిన వేలమంది బీఆర్ఎస్ కార్యకర్తల పోరాటానికి ప్రభుత్వం, పోలీసులు దిగివచ్చారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసినవారిపై హత్యాయత్నం కేసు నమోదు చేస్తామని డీజీపీ హామీ ఇవ్వడంతో కార్యకర్తలు వెనుదిరిగారు. అంతకుముందు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఫిరాయింపు ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మూకదాడి జరిపిన సంఘటన నేపథ్యంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహోదగ్రులయ్యారు. పోలీసు అధికారులు కాంగ్రెస్ బాసుల కనుసన్నల్లో పనిచేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి ఘటనపై ఫిర్యాదు చేయటానికి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు వెళ్లిన మాజీమంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, అనేకమంది బీఆర్ఎస్ నాయకులను రెండు బృందాలుగా విడగొట్టి అనేక గంటలపాటు పోలీస్ వాహనాల్లో తిప్పి.. రంగారెడ్డి జిల్లాలోని కేశంపేట, తలకొండపల్లి స్టేషన్లకు తరలించారు. ఈ విషయం తెలిసిన వేలమంది స్థానిక ప్రజలు, గ్రామస్థులు, బీఆర్ఎస్ అభిమానులు పోలీస్ స్టేషన్ల ముందు ఆందోళనకు దిగారు. పోలీస్ వాహనాలను అడ్డుకొన్నారు. నిప్పు పెట్టి టైర్లను కాల్చేశారు. పోలీసులు పలుమార్లు వారిపై లాఠీచార్జీ చేసినా ప్రజలు వెనక్కి తగ్గలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్ నేతలను విడుదల చేస్తున్నట్టు పోలీసులు ప్రకటించారు. అయితే, తమను ఎందుకు నిర్బంధించారో, ఇన్ని గంటలసేపు ఎందుకు పోలీస్ వాహనాల్లో తిప్పారో, ఎందుకు ఇంత దూరం తీసుకొని వచ్చారో చెప్పనిదే తాము స్టేషన్‌ను విడిచి బయట కాలు పెట్టే సమస్యే లేదని బీఆర్ఎస్ నేతలు తేల్చిచెప్పారు. ముఖ్యంగా.. తాము ఫోన్ చేసినప్పుడు పోలీస్ ఉన్నతాధికారులు ఎందుకు స్పందించలేదని స్థానిక పోలీసులను హరీశ్‌రావు ప్రశ్నించారు. ఒక దశలో స్థానిక పోలీసులు హరీశ్‌రావుకు దండం పెట్టి మరీ.. దయచేసి స్టేషన్ నుంచి వెళ్లిపోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అయితే, హరీశ్‌రావు వారికి ప్రతిన మస్కారం చేసి తమ ప్రశ్నలకు జవాబిచ్చేవరకు స్టేషన్ నుంచి కదిలే సమస్యే లేదని అంతే మర్యాదగా జవాబిచ్చారు. 'ఇదెక్కడి దుర్మార్గం.. మమ్మల్ని ఎందుకు అరెస్ట్ చేశారు? ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు? శాసనసభ్యులను అరెస్ట్ చేసేముందు స్పీకర్ అనుమతి తీసుకున్నారా?' అని నిలదీశారు. హరీశ్‌రావు ప్రశ్నలకు పోలీసులు సమాధానం చెప్పలేక బిక్కముఖం వేశారు. ఠాణా నుంచి బయటకు వెళ్లబోమని హరీశ్‌రావు తదితరులు భీష్మించటం, బయట వేల సంఖ్యలో జనం గుమిగూడటం.. పెద్ద ఎత్తున నినాదాలు.. లాఠీచార్జీతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో పరిస్థితి చేయిదాటిపోయే అవకాశం ఉన్నదని ఉన్నతాధికారులకు స్థానిక పోలీస్ అధికారులు నివేదించారు. పర్యవసానంగా డీజీపీ జితేందర్ హరీశ్‌రావుకు ఫోన్‌చేసి మాట్లాడారు. దయచేసి సహకరించాలని, స్టేషన్ నుంచి వెళ్లిపోవాలని డీజీపీ.. హరీశ్‌రావును రిక్వెస్ట్ చేశారు. 'కనీసం తాగడానికి నీళ్లు కూడా ఇవ్వకుండా గంటల తరబడి వాహనాల్లో మమ్మల్ని ఎందుకు తిప్పారు? ప్రజాప్రతినిధులం అనే గౌరవం కూడా లేకుండా పోలీసులు అలా ఎలా వ్యవహరిస్తారు? శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మమ్మల్ని ఎందుకు అరెస్ట్ చేశారు?' అని హరీశ్.. డీజీపీపై ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో డీజీపీ ఆయనకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. 'మీరు సీనియర్ నాయకులు. మనమంతా కలిసి తెలంగాణ తెచ్చుకున్నాం. దాన్ని అభివృద్ధి చేసుకున్నాం. మీ అభ్యంతరాలు, ఆరోపణలన్నింటినీ నేను పరిగణనలోకి తీసుకొన్నాను. వాటిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాను. కౌశిక్ ఇంటిపై దాడిచేసిన గాంధీ, ఆయన అనుచరులపై ఇప్పటికే 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశాం. మీరు మాకు సహకరించాలి. మీపట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై తప్పక విచారణ జరుపుతాం. రాష్ట్రంలో వినాయక నవరాత్రులు జరుగుతున్నాయి. త్వరలో నిమజ్జనం ఉన్నది. మీరు మాకు సహకరించాలి' అని డీజీపీ పదేపదే విజ్ఞప్తి చేశారు.

అమెరికా నుంచి డీజీపీకి కేటీఆర్ ఫోన్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తమ పార్టీ ఎమ్మెల్యేలపై జరుగుతున్న వరుస దాడులను కేటీఆర్ ఖండించారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన గురువారం రాత్రి డీజీపీతో ఫోన్‌లో మాట్లాడారు. ఖమ్మంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్‌పై కాంగ్రెస్ నాయకుల దాడిని ప్రస్తావించారు. రైతు రుణమాఫీపై శాంతియుతంగా ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెలపై దాడిని గుర్తు చేశారు. తాజాగా కౌశిక్‌రెడ్డిపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చేసిన దాడి ఘటనలపై పోలీసుల నిష్క్రియాపరత్వాన్ని ఆయన డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై డీజీపీ సానుకూలంగా స్పందించి విచారణ చేపడతామని పేర్కొన్నారని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

దయచేసి సహకరించాలని హరీశ్‌కు డీజీపీ ఫోన్

కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులను ఎందుకు అరెస్టు చేశారో చెప్పాలని పోలీసులకు చేతులు జోడించి దండం పెడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ తదితరులు

బాధ్యతతో సహకరిస్తున్నాం: హరీశ్ రావు

పోలీసులు బేషరతుగా విడుదల చేస్తున్న సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. ఈ పోరాటంలో పాలు పంచుకున్న ఎమ్మెల్యేలకు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం బాగుండాలని కోరుకునే పార్టీగా బాధ్యతతో ఆందోళనను విరమిస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడిచేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నేతలను అరెస్ట్ చేయలేదని, బేషరతుగా విడుదల చేస్తున్నట్టు చెప్పారన్నారు. రాష్ట్రంలో ఓవైపు గణేశ్ నిమజ్జనం జరుగుతున్నదని, ఇలాంటి సమయంలో శాంతి భద్రతలకు సమస్యలు కలిగించవద్దని, పోలీసులకు సహకరించాలని కోరారన్నారు. హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతినొద్దనే ఉద్దేశంతో డీజీపీ హామీ మేరకు వెనక్కి వెళ్తున్నట్టు చెప్పారు. మాట మీద నిలబడాలని కోరారు. లేదంటే మరోసారి ఉద్యమం చేస్తామన్నారు. అధికారంలో ఎవరున్నారన్నది సమస్య కాదని, ఈరోజు వాళ్ల దగ్గర ఉంటే, రేపు తమ దగ్గర ఉండొచ్చన్నారు. శాంతి భద్రతలు కాపాడాలని, ఏకపక్షంగా కాకుండా న్యాయం పక్షాన ఉండాలని పోలీసు అధికారులను కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. 'మీకు ఎన్నిరకాలుగా కృతజ్ఞత చెప్పినా తక్కువే. మమ్మల్ని అరెస్ట్ చేసి కేశపట్నంవైపు తెస్తున్నారని తెలియగానే కొన్ని నిమిషాల్లో వచ్చారు. ప్రాణాలకు తెగించి అడ్డం పడ్డారు. మేం వెళ్లిన తర్వాత మా కార్యకర్తలను ఇబ్బందిపెడితే తిరిగి వస్తాం. మా ప్రాణాలను అడ్డం పెట్టి అయినా వారి కోసం పోరాడుతాం' అని స్పష్టం చేశారు. జిల్లాల్లో కార్యకర్తలను బైండోవర్ చేస్తున్నారని, అలాంటి చర్యలు మానుకోవాలని పోలీసులను కోరారు. కార్యకర్తలందరూ సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. 'మన లక్ష్యం రైతులకు రుణమాఫీ కావాలి.. మన లక్ష్యం పేదలకు రూ.4వేల ఆసరా పెన్షన్లు అందాలి.. మన లక్ష్యం మహిళలకు ప్రతి నెల రూ.2,500 రావాలి.. దాని కోసం పోరాడుదాం' అని విజ్ఞప్తి చేశారు.

హరీశ్ భుజానికి తీవ్రగాయం!

- **కర్కశంగా ఈడ్చిపడేసిన పోలీసులు**
- **నొప్పితో విలవిల్లాడిన మాజీ మంత్రి**
- **నొప్పితోనే.. పోలీస్‌స్టేషన్‌లో**

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): పోలీసుల కర్కశత్వం వల్ల మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎడమ భుజానికి తీవ్ర గాయమైంది. సైబరాబాద్ కమిషనరేట్‌లో సాయంత్రం హరీశ్‌రావును అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయనను కర్కశంగా ఈడ్చిపడేశారు. ఇష్టమొచ్చినట్లు నెట్టేయడంతో ఆయన ఎడమ భుజానికి తీవ్రగాయమైనట్టు తెలిసింది. పోలీసులు అదుపులోకి తీసుకునే క్రమంలోనే గాయం కావడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల్లో కొందరు కావాలనే హరీశ్‌రావును గాయపర్చినట్టు ప్రత్యక్షసాక్షులు చెప్తున్నారు. ఆయన నొప్పిని భరిస్తూ పోలీసుల తీరును నిరసించారు. చేయి నొప్పి పెడుతున్నదని అరిచినా.. కనీసం కనికరం లేకుండా పోలీసులు ఇష్టారీతిన ఈడ్చిపడేయడంతో ఆ నొప్పి మరింత తీవ్రతరమైనట్టు తెలిసింది. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో హరీశ్‌రావును అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ నొప్పికి ఎలాంటి ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టలేదు. బస్సులో గంటల తరబడి తిప్పుతున్నా హరీశ్‌రావు నొప్పిని భరించారు. ఎక్కడైనా ప్రథమ చికిత్స కోసం ఆపాలని పోలీసులను అడిగినా.. ఎవరూ స్పందించలేదని తోటి బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. దీంతో అలాగే భుజం నొప్పిని భరిస్తూ.. కేశంపేటకు చేరుకున్నారు. కేశంపేట పోలీస్‌స్టేషన్ లోపలికి తరలించే క్రమంలోనూ మరోసారి పోలీసులు నెట్టివేయడంతో ఆ నొప్పి మరింత తీవ్రమైందని బీఆర్ఎస్ నేతలు చెప్పారు. స్టేషన్ బయట కార్యకర్తలతో మాట్లాడేటప్పుడు కూడా ఆ నొప్పిని మునిపంటితో అదిమిపట్టి దిశానిర్దేశం చేశారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 11.20 వరకు పోలీసుల అదుపులో ఉన్న హరీశ్‌రావు.. తన వాహనంలో వెళ్తూ ప్రథమ చికిత్స తీసుకున్నట్టు తెలిసింది.

కేశంపేట.. తలకొండపల్లి ఉద్యమ స్ఫూర్తి

- **బీఆర్ఎస్‌కు అపూర్వ సంఘీభావం**

హైదరాబాద్/రంగారెడ్డి, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులను అరెస్టు చేసిన పోలీసులు వారిన వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న సమయంలో రంగారెడ్డి జిల్లాలోని కేశంపేట, తలకొండపల్లి గ్రామాల ప్రజలు మరోసారి నాటి ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శించారు. కేశంపేట వద్ద హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులున్న వాహనాలకు అడ్డంగా రోడ్డుపై దాదాపు వెయ్యి మందికి పైగా స్థానిక ప్రజలు బైఠాయించారు. ప్రజల నుంచి ఊహించని ప్రతిఘటన ఎదురవ్వడంతో పోలీసులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు హరీశ్‌రావు బృందాన్ని తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌లు పోలీస్ స్టేషన్‌కు హుటాహుటిన వచ్చారు.అయితే, పోలీస్‌స్టేషన్ వద్దకు వేలాది ప్రజలు చేరుకొని నినాదాలతో హోరెత్తించారు. ఒక దశలో పోలీసులు చేతులెత్తేశారు. ఏం చేయాలో పాలుపోక.. 'దయచేసి వెళ్లిపోండి సర్' అంటూ తాము అరెస్టు చేసి తీసుకొచ్చిన బీఆర్ఎస్ నేతలను బతిమాలుకున్నారు. మధుసూదనాచారి, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, డాక్టర్ సంజయ్, వివేక్, శంభీపూర్ రాజు తదితరులను తలకొండపల్లి వైపు తీసుకెళ్లారు. ఈ విషయం తెలిసిన తలకొండపల్లి ప్రజలు భారీగా తరలి వచ్చి ప్రధాన రహదారిపై ఆయా వాహనాలను అడ్డుకున్నారు. పోలీసులు లాఠీచార్జి చేస్తున్నప్పటికీ వెనక్కితగ్గలేదు. వేరే గత్యంతరం లేకపోవడంతో బీఆర్ఎస్ నేతలను తలకొండపల్లె పోలీసుస్టేషన్‌కు తరలించారు. తమను సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ వద్ద అదుపులోకి తీసుకొని సుమారు రెండు గంటలపాటు రోడ్లపై తిప్పారని, మారుమూల గ్రామాల నుంచి అత్యంత వేగంతో వాహనాల్లో తరలించారని శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి వివరించారు.

కౌశిక్ హౌస్ అరెస్ట్.. గాంధీ కాన్వాయ్‌కి పూర్తి పర్మిట్!

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పోలీసులు గురువారం కొండాపూర్‌లోని ఆయన ఇంట్లో హౌస్ అరెస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరడం ద్వారా పీఏసీ చైర్మన్‌గా ఎంపికైనట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటి వద్ద బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తానని కౌశిక్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఇంటివద్ద పోలీసులు మోహరించారు. కౌశిక్‌రెడ్డిని బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను కూడా అనుమతించలేదు.

రెచ్చిపోయిన గాంధీ

కౌశిక్‌రెడ్డిని గృహనిర్బంధం చేయడంతో అరికెపూడి రెచ్చిపోయారు. గాంధీ ఫ్యాక్షనిస్టుల తరహాలో భారీ వాహనశ్రేణితో కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. గేటెడ్ కమ్యూనిటీ గేట్ వద్ద స్థానికులను అనుమతించని పోలీసులు గాంధీని, ఆయన అనుచరులను మాత్రం వెళ్లనిచ్చారు. దీంతో యథేచ్ఛగా లోపలికి వచ్చిన రౌడీమూక కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసినట్టు తెలుస్తున్నది.

ఆహ్వానించేందుకు సిద్ధమైన కౌశిక్

గాంధీని సాదరంగా తన ఇంట్లోకి ఆహ్వానించడానికే కౌశిక్‌రెడ్డి సిద్ధమైనట్టు చెప్తున్నారు. బీఆర్ఎస్ మహిళానేతలు కూడా హారతి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. గాంధీని సాదరంగా ఆహ్వానించి, భోజనం పెట్టి, తెలంగాణభవన్‌కు వెళ్లి ప్రెస్‌మీట్ నిర్వహించి, కేసీఆర్ వద్దకు వెళ్లాలని కౌశిక్‌రెడ్డి భావించినట్టు పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. అయినప్పటికీ గాంధీ వ్యూహం ప్రకారం కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయించారు.

భగ్గుమన్న తెలంగాణ

- **బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులపై జనాగ్రహం**
- **రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనలు**
- **బీఆర్ఎస్ నేతలను తరలిస్తున్న వాహనాల అడ్డగింత**
- **బీఆర్ఎస్ శ్రేణులపై విరిగిన లాఠీ**
- **వేలాదిగా తరలిన క్యాడర్**

రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్ నాయకులను తరలిస్తున్న పోలీసుల వాహనాన్ని అడ్డుకుంటున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తొలిదశ, మలిదశ ఉద్యమాల తర్వాత తెలంగాణ సమాజం మరోసారి తిరగబడింది. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కిన వారినే అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా నిరసించింది. అరెస్టు చేసిన నేతలను ఎవ్వరికీ కనిపించకుండా హైదరాబాద్ నగరం బయటకు తరలించే ప్రయత్నాలను ఛేదించింది. దీంతో వేలాదిగా బీఆర్ఎస్ కార్యకర్తలు, సానుభూతి పరులు ఎక్కడికక్కడే స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చారు. పోలీసుల వాహనాలను అడ్డగించే ప్రయత్నం చేశారు. తమ నేతలను విడిచిపెట్టాలని డిమాండ్ చేస్తూ.. రహదారులను దిగ్బంధం చేశారు. హరీశ్‌రావు సహా, బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

అన్ని వైపులా మోహరించిన కార్యకర్తలు

బీఆర్ఎస్ ముఖ్య నేతలను అరెస్టు చేసి, మూడు మార్గాల్లో, మూడు వాహనాల్లో తరలిస్తున్న పోలీసు ప్రయత్నాలను బీఆర్ఎస్ కార్యకర్తలు భగ్నం చేశారు. నేతలను తరలించే వాహనాల జాడ తెలుసుకొని అన్ని వైపులా రోడ్లపై మోహరించారు. రెండున్నర గంటల తర్వాత రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి, కొత్తపేట, కేశంపేట రహదారుల వైపు తీసుకొస్తున్నారని తెలుసుకొని ఆయా గ్రామాల ప్రజలు వేలాదిగా రోడ్లపైకి వచ్చారు. బీఆర్ఎస్ నేతలను తరలిస్తున్న వాహనాలు వెళ్లకుండా రోడ్లపై నిప్పు పెట్టారు. ఆయా రహదారుల పరిధిలో అన్ని చోట్లా నిరసనలు మిన్నంటాయి. ఆందోళనలతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయింది. స్వచ్ఛందంగా ముందుకొచ్చిన ప్రజలు ఈ ప్రయత్నంలో పోలీసు వాహనాల టైర్లలో గాలి తీసేశారు. ప్రణాళిక ప్రకారమే మారుమూల పోలీస్‌స్టేషన్లకు తరలించే ప్రయత్నం చేశారు. అయితే, గత్యంతరం లేక హైదరాబాద్ సిటీకి 150 కిలోమీటర్ల దూరంలో, సైబరాబాద్ పరిధిలోని చివరి పీఎస్‌లు అయిన కేశంపేట, తలకొండపల్లి పోలీస్‌స్టేషన్లకు బీఆర్ఎస్ నేతలను తరలించారు.

నిరసనలపై విరిగిన లాఠీ

అక్రమ అరెస్టులకు నిరసనగా ఆందోళనలు చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు, సానుభూతిపరులపై పలుచోట్ల పోలీసులు లాఠీలు ఝుళిపించారు. అయినా వెనుకడుగు వేయకుండా బీఆర్ఎస్ కార్యకర్తలు ఉద్యమకాలం నాటి స్ఫూర్తిని ప్రదర్శించారు. పోలీసులు ఈడ్చిపడేస్తున్నా, లాఠీలతో కొడుతున్నా, వెనకడుగు వేయకుండా కేశంపేట, తలకొండపల్లి పోలీస్‌స్టేషన్లకు వేలాదిగా తరలి వచ్చి తమ నాయకత్వానికి మద్దతు తెలిపారు.

మూత్ర విసర్జనకు కూడా ఆపలేదు

పోలీసులు అరెస్టు చేసిన బీఆర్ఎస్ నేతలను పోలీసు వాహనంలో ఎక్కించి రెండున్నర గంటలపాటు హైదరాబాద్ నగరంలోని రోడ్లపై తిప్పారు. మూత్ర విసర్జనకు కూడా వాహనాన్ని ఆపలేదు. కనీసం మంచినీళ్లు సైతం ఇవ్వలేదు. ఎమ్మెల్యేల్లో చాలమంది షుగర్, బీపీ లాంటి రుగ్మతలతో బాధపడుతున్నా కనికరించలేదు. పోలీసులు వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. దమనకాండకు దిగడమే ప్రజాపాలనా? అని విమర్శించారు. ప్రశ్నించిన నాయకులను పోలీసులు లాగిపడేస్తూ పిడిగుద్దులు గుద్దారు. ఎమ్మెల్యేలు ఉన్న వాహనాన్ని చివరకు నగరానికి 150 కిలోమీటర్ల దూరంలో రంగారెడ్డి జిల్లాతలకొండ పోలీస్‌స్టేషన్‌కు, హరీశ్‌రావు ఉన్న వాహనాన్ని షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట ఠాణాకు తీసుకెళ్లారు.

అదనపు బలగాల రాక

బీఆర్ఎస్ శ్రేణులు, పరిసర గ్రామ ప్రజలు వెల్లువలా మద్దతు తెలిపేందుకు వస్తుండటంతో పోలీసులు కంగుతిన్నారు. ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనను తిప్పికొట్టేందుకు ఒక్కసారిగా అదనపు బలగాలతో మోహరించారు. కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు ప్రజలు వేలాదిగా తరలి వస్తుండటంతో అదనపు బలగాలన్నీ అక్కడే మోహరించాయి. అక్కడికి మిగిలిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం వస్తుండటంతో రాత్రి పదిన్నర వరకూ వేలాది ప్రజలు పోలీస్‌స్టేషన్‌ను చుట్టుముట్టి నిరసన తెలిపారు. అదనపు బలగాలతో వారిని సైతం చెదరగొట్టే ప్రయత్నం చేశారు. హైదరాబాద్‌లోనూ ఎమ్మెల్యే గాంధీ ఇంటి దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. ఆయన కుటుంబ సభ్యులకు సైతం బందోస్తు ఏర్పాటు చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

అరెస్టు ఎందుకు చేశారు?

తమ అరెస్టు నేపథ్యంలో డీజీపీ జితేందర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్ చేశారు. కనీసం తాగడానికి నీళ్లు కూడా ఇవ్వకుండా గంటల తరబడి వాహనాల్లో తిప్పుతున్న విషయాన్ని హరీశ్‌రావు చెప్పినప్పటికీ డీజీపీ సరిగా స్పందించలేదని తెలిసింది. కనీసం ప్రజాప్రతినిధులం అనే గౌరవం కూడా లేకుండా పోలీసులు తమ పట్ల వ్యవహరించిన తీరును డీజీపీకి వివరించగా.. ఏదో సర్దిచెప్పే ప్రయత్నం చేసినట్టు సమాచారం. కేశంపేట పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'తెలంగాణలో కొనసాగుతున్నది ప్రజాపాలనా? రాక్షసపాలనా? శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మమ్మల్ని ఎందుకు అరెస్ట్ చేశారు? ఇదేం ప్రజాస్వామ్యం? ఇదెక్కడి దుర్మార్గం.. ఏం తమాషాలు చేస్తున్నారా?' అని మండిపడ్డారు. తమను ఎందుకు అరెస్ట్ చేశారు? ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు? శాసనసభ్యులను అరెస్ట్ చేసేముందు స్పీకర్ అనుమతి తీసుకున్నారా? అని నిలదీశారు. హరీశ్‌రావు ప్రశ్నలకు పోలీసులు సమాధానం చెప్పలేక బిక్కమొహం వేశారు.